بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ



## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు
## హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం దాతృత్వం, ఉదారత ఆధారంగా విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.07.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ ـ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ ـ
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం పవిత్ర జీవిత చరిత్రను వివరిస్తూ హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ రజియల్లాహు అన్హు ఇలా వ్రాశారు: హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం జీవితంలో ఔదార్యం, దాతృత్వానికి సంబంధించిన మరొక అద్భుతమైన రూపం కూడా కనిపించేది, అది సిఫార్సు, మధ్యవర్తిత్వ రూపంలో ఉండేది. కొన్నిసార్లు ఆయన అలైహిస్సలాం సేవలోకి అలాంటి యాచకుడు వచ్చేవాడు, అతని కోరికను తీర్చడం ఆయన అలైహిస్సలాం చేతుల్లో ఉండేది కాదు, దానికి ఇతరులతో సంబంధం ఉండేది. అటువంటి స్థితిలో కూడా ఆయన ఆ వ్యక్తి ప్రయోజనం కోసం అలాంటి వారికి కూడా సిఫార్సు చేయడానికి సిద్ధపడేవారు, ఎవరినైతే ఆయన తన స్వంత అవసరాల కోసం ఎన్నడూ ఏమీ అడిగి ఉండేవారు కాదు. మిర్జా ఇమాముద్దీన్ గారు ఈ సంస్థకు తీవ్ర శత్రువుగా ఉండేవారు. హజ్రత్ అలైహిస్సలాం కుటుంబంతో ఆయనకు పగ ఉండేది. కానీ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం లౌకిక విషయాలలో అతని శత్రుత్వాన్ని ఎల్లప్పుడూ విస్మరించేవారు. అంటే అతని పట్ల ప్రవర్తించే విధానంలో ఆయన అలైహిస్సలాం ఎన్నడూ తేడా చూపించలేదు. అతను చాలాసార్లు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం నుండి ఆర్థిక సహాయం పొందేవాడు, ఈ ఉపకారాలు పొందుతున్నప్పటికీ శత్రుత్వంలోనే నిమగ్నమై ఉండేవాడు. ఒకసారి అతను ఒక గుర్రాన్ని విక్రయించవలసి వచ్చింది. అందుకోసం అతను ఒక మంచి ఉపాయాన్ని ఆలోచించాడు. ఆ గుర్రాన్ని జమ్ముకు తీసుకువెళ్లి హజ్రత్ హకీముల్ ఉమ్మత్ మౌల్వీ నూరుద్దీన్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజిల్లాహు అన్హు గారి ద్వారా సమర్పిస్తే దానికి తగినంత మంచి ధర లభిస్తుందని భావించాడు. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకుని అతను స్వయంగా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను కలిసి హజ్రత్ హకీముల్ ఉమ్మత్ గారి పేరిట ఒక సిఫార్సు లేఖ వ్రాయాలని అభ్యర్థించాడు. ఆయన అలైహిస్సలాం అతని అభ్యర్థనను తిరస్కరించకుండా, ఎలాంటి సంకోచం లేకుండా హజ్రత్ మౌల్వీ (రజి) గారి పేరిట ఒక సిఫార్సు లేఖను ఇచ్చారు.

మిర్జా ముహమ్మద్ బేగ్ (తండ్రి మిర్జా అహ్మద్ బేగ్ హోషియార్‌పురి) కుటుంబం ధార్మిక ఆచారాలకు దూరంగా మరియు ఈ సంస్థకు శత్రువుగా ఉండటం వల్ల ఆ కుటుంబంతో ఆయన అలైహిస్సలాం గారికి సత్సంబంధాలు లేకెండెను. మిర్జా ముహమ్మద్ బేగ్ జమ్ములో ఉద్యోగం చేయాలని ఆశించి, హజ్రత్ హకీముల్ ఉమ్మత్ (రజి) గారి పేరిట ఒక సిఫార్సు లేఖ ఇస్తే వారు తనకు సహాయం చేస్తారని

హుజూర్ అలైహిస్సలాంను అభ్యర్థించాడు. ఆయన అలైహిస్సలాం ఎలాంటి సంకోచం లేకుండా ఇలా లేఖ రాశారు: వీరి తండ్రి నాతో పగ కలిగి ఉన్నప్పటికీ వారి కఠినత్వానికి బదులుగా మృదుత్వాన్ని అవలంబించి పవిత్ర ఖుర్ఆన్‌లోని ఆదేశం اِدْفَعْ بِالَّتِيْ هِيَ اَحْسَنُ అనగా నీవు దుష్టత్వమునకు సమాధానముగా చాలా మంచిగా వ్యవహరించుము ప్రకారం పుణ్యాన్ని పొందడంలో ఎలాంటి అభ్యంతరం లేదు. కాబట్టి వీరికి సహాయం చేసి పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పించండి.

హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రజి) ఇలా వ్రాస్తున్నారు: ఖాదియాన్‌లో నిహాల్ చంద్ అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను తన యవ్వనంలో ప్రసిద్ధ వ్యాజ్యాల మారి. హజ్రత్ అలైహిస్సలాం కుటుంబంతో సాధారణంగా పోటీ పడుతూ, అల్లరి పనులు చేస్తూ ఉండేవాడు. జీవితం చివరి దశలో అతని ఆర్థిక పరిస్థితి చాలా క్షీణించింది. ఎంతలా అంటే కొన్నిసార్లు అతనికి తన దైనందిన అవసరాలను తీర్చుకోవడం కూడా కష్టంగా మారేది. ఒకసారి అతను హజ్రత్ అలైహిస్సలాం గుమ్మం వద్దకు వచ్చి కలవాలని కోరాడు మరియు తన బాధను చెప్పుకున్నాడు. ఆయన అలైహిస్సలాం అతనికి ధైర్యం చెప్పి, 25 రూపాయల మొత్తాన్ని ఇచ్చారు. అంతేకాక ఎప్పుడు అవసరమున్నా నాకు చెప్పు అని అన్నారు. ఆ తర్వాత అది అతనికి ఒక అలవాటుగా మారింది. అతను ఒకటి రెండు నెలల కొకసారి వచ్చి, తగినంత మొత్తాన్ని తీసుకువెళ్లేవాడు. ఒకసారి అతను హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) నుండి కూడా అప్పు తీసు కున్నాడు. ఆయన (రజి) తిరిగి ఇవ్వమని అడిగినప్పుడు అతను ఇలా అన్నాడు. మిర్జా గారు అయితే నాకు ఎప్పుడూ డబ్బులు ఇస్తూనే ఉంటారు, దానితోనే నా సంసారం సాగుతోంది. ఆయన ఎన్నడూ నా నుండి డబ్బులు తిరిగి అడగలేదు. దాంతో ఆయన (రజి) కూడా అతనిని వదిలేశారు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఇట్లు వ్రాస్తున్నారు: వై.ఎమ్.సి.ఎ కార్యదర్శిగా ఉన్న పాద్రీ వాల్టర్ గారు తన పుస్తకంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గురించి ఈ విధంగా అభిప్రాయ పడ్డారు. మిర్జా గారు తన అలవాట్లలో సరళమైన, దాతృత్వ భావాలు కలిగిన వ్యక్తి. తన ప్రత్యర్థుల నుండి ఎదురైన తీవ్ర వ్యతిరేకత, వేధింపులకు వ్యతిరేకంగా ఆయన చూపిన నైతిక ధైర్యం ఖచ్చితంగా ప్రశంసనీయం. ఒక అయస్కాంత ఆకర్షణ, అత్యంత ఆహ్లాదకరమైన నైతిక ప్రవర్తన కలిగిన వ్యక్తి మాత్రమే అలాంటి వ్యక్తుల స్నేహాన్ని, విశ్వాసాన్ని పొందగలడు, వారిలో కనీసం ఇద్దరు ఆఫ్ఘనిస్తాన్‌లో తమ విశ్వాసం కారణంగా ప్రాణాలు అర్పించారు, కానీ మిర్జా గారి చేతిని వదలలేదు. నేను కొందరు పాత అహ్మదీలను వారు అహ్మదీలుగా మారడానికి గల కారణాన్ని అడిగినప్పుడు, చాలామంది హజ్రత్ మిర్జా గారి వ్యక్తిగత ప్రభావం, వారి ఆకర్షణీయమైన వ్యక్తిత్వాన్నే అతిపెద్ద కారణంగా పేర్కొన్నారు.

ఆయన (అ) ఎవరికైనా ఏదైనా ఇచ్చేటప్పుడు అది ఏ విధమైన ఆడంబరం లేదా ప్రదర్శన కోసం ఇచ్చేవారు కాదు. కేవలం అల్లాహ్ సంతోషం కోసం, సృష్టి పట్ల కరుణ అనే ఉద్దేశ్యంతోనే ఇచ్చేవారు. అందువల్ల సాధారణంగా ఆయన అలైహిస్సలాం చాలా రహస్యంగా దాన ధర్మాలు చేసేవారు, కొన్నిసార్లు ఇతరులకు ఆచరణాత్మక పాఠం నేర్పడానికి బహిరంగంగా కూడా ఇచ్చేవారు. యాచకుడి లేదా సహాయం కోరేవాడి మాటను తిరస్కరించకపోవడం ఆయన (అ) అలవాటు. అలాగే కొందరి అవసరాలను ముందే గ్రహించి, వారు అడగక ముందే వారికి సహాయం చేయడం కూడా ఆయన (అ) దినచర్యలో భాగం. 1904లో ఒకసారి, ఒక నమ్మకమైన వలసదారునికి కొంత డబ్బు ఇచ్చి, ఇది శీతాకాలం, మీకు బట్టలు అవసరమవుతాయని చెప్పారు. వాస్తవానికి అతని నుండి ఎలాంటి అభ్యర్థన లేదు. ఇంకా ఆయన (అ) ప్రజలకు చాలా రహస్యంగా ఇచ్చేవారు. అందులో మిత్రుడు, శత్రువు అనే తేడా చూసేవారు కాదు.

షేక్ ఫతహ్ ముహమ్మద్ గారిలా చెప్పారు. నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం సేవ

లోకి హాజరైనప్పుడు, ఆయన ఎల్లప్పుడూ నా ప్రయాణ ఖర్చులు చెల్లించడానికి సిద్ధంగా ఉండేవారు. నాకు అవసరం లేకపోయినప్పటికీ, హజ్రత్ గారి దాతృత్వ గుణం ఎంత గొప్పదంటే, ఆయన అడగకుండానే ఎల్లప్పుడూ డబ్బులు ఇచ్చేవారు. ఇది కేవలం నా విషయంలోనే కాదు, చాలామందికి ఆయన ఇలా ఇస్తూనే ఉండేవారు. సిరియా మరియు అరబ్ దేశాల నుండి కొందరు వ్యక్తులు వచ్చేవారు, వారు చాలా సుదూర ప్రాంతాల నుండి వచ్చినందున, ఆయన వారికి కొన్నిసార్లు ప్రయాణ ఖర్చుల కోసం భారీ మొత్తంలో డబ్బు ఇచ్చేవారు. కొన్నిసార్లు ప్రజలు నోటితో అడగకుండా చిన్న చీటీ రాసిచ్చేవారు. అతను సహాయం కోరాడనే విషయం ఎవరికీ తెలిసేది కాదు, కానీ హజ్రత్ అక్దస్ అలైహిస్సలాం లోపలి నుండి ఆ యాచకుడి కోసం ఏదైనా పంపినప్పుడు లేదా లోపలికి వెళ్లేటప్పుడు నువ్వు కూర్చో, నేను వస్తానని చెప్పినప్పుడు మాత్రమే తెలిసేది. హజ్రత్ గారు తిరిగి వచ్చినప్పుడు, ఆ యాచకుడికి కావలసిన నగదు లేదా బట్టలు తీసుకొని వస్తున్నట్లు తెలిసేది.

ఆయన (మసీహ్‌గా) ప్రకటించుకోవడానికి ముందు, ఆయన సోదరుని వివాహ సమయంలో వారు కొన్ని మేకలను తెప్పించారు. వాటిని నంగల్ బాగ్‌బానా గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మేపుతూ ఉండే వాడు. ఒకరోజు హుజూర్ (అ) నడకకు వెళ్తుండగా, దారిలో ఆ వ్యక్తి కనిపించాడు. అతనితో పాటు అతని కుమారుడు కూడా ఉన్నాడు, కానీ అతను వట్టి కాళ్లతో (చెప్పులు లేకుండా) ఉన్నాడు. హుజూర్ (అ) అతని వైపు చూసి, మియా! నువ్వు వట్టి కాళ్లతో తిరుగుతున్నావు, నీకు ముళ్లు గుచ్చుకోవడం లేదా? అని అడిగారు. దానికి అతను హుజూర్! నా దగ్గర చెప్పులు లేవు అని మనవి చేసుకున్నాడు. హుజూర్ (అ) వెంటనే తన చెప్పులు విప్పి అతనికి తొడిగారు. అతను వద్దని నిరాకరించగా ఆయన లేదు! దీన్ని వేసుకో, వాడుకో అని అన్నారు. ఆ తర్వాత ఆయన వట్టి కాళ్లతోనే తిరిగి ఇంటికి వచ్చేశారు. ఆ సమయంలో ఆయన వయస్సు ఇరవై లేదా ముప్పై సంవత్సరాలు ఉంటుంది.

హుజూర్ అలైహిస్సలాం తన ఉపకర్త, మార్గదర్శకుడైన మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరిస్తూ ఔదార్యం, దాతృత్వానికి ప్రతిరూపంగా నిలిచారు. అయితే, కొన్నిసార్లు ఏదైనా వివేకం లేదా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన యాచకునికి ఇవ్వకుండా నివారించినట్లు కూడా మనకు కనిపిస్తుంది. షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ గారు (రజి) ఇట్లు వ్రాస్తున్నారు: 1889 సం॥లో ఆయన లుధ్యానాలో ఉన్నారు. ఆయన వద్దకు ఒక యాచకుడు వచ్చి నా బంధువు ఒకరు మరణించారు, అతని అంతిమ సంస్కారాల కోసం నా దగ్గర ఎలాంటి ఏర్పాట్లు లేవని చెప్పాడు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గౌరవనీయులైన ఖాజీ ఖ్వాజా అలీ (రజి) గారితో ఇతనితో పాటు వెళ్లి కఫన్ (శవవస్త్రం) సామాగ్రిని సమకూర్చండని చెప్పారు. సాధారణంగా హుజూర్ గారికి ఇలా చేసే అలవాటు లేదు, అడిగిన వ్యక్తికి నేరుగా ఇచ్చేసేవారు. ఖాజీ గారు ఆ యాచకుడితో కలిసి బయలుదేరారు. కొంత సమయం తర్వాత ఆయన నవ్వుతూ తిరిగి వచ్చి ఇలా చెప్పారు. ఆ యాచకుడు బ్రతిమిలాడటం, పొగడటం మొదలుపెట్టి మీరు రావద్దు, ఇవ్వాల్సింది ఏదో ఇక్కడే ఇచ్చేయండి అన్నాడు. నేను లేదు! నాకు ఇదే ఆజ్ఞ అయిందని చెప్పగా వాడు ఎవరూ చనిపోలేదు, కఫన్–దఫన్ అవసరం కూడా లేదు. ఇది నా వృత్తి, ఇప్పుడు నా గుట్టు రట్టు చేయకండి, ఇక ముందు నేనిలా ఏయనని చెప్పి వెళ్లిపోయాడు.

ఆయన అలైహిస్సలాం పిల్లల కోరికల ప్రకారం కూడా దాన ధర్మాలు చేసేవారు. హకీమ్ ముహమ్మద్ ఉమర్ ఖాదియాన్ గారి భార్య అజీజ బేగం గారి తల్లి అయిన బీబీ రాణి గారిలా వివరించారు: నేను 1901 సం॥లో లేఖ ద్వారా బైఅత్ చేశాను. 1902 సం॥లో నేను ఖాదియాన్ వచ్చినప్పుడు నా

చిన్న కుమార్తె నా వెంట ఉంది. హ్రజత్ గారు ఉదయం పూట నడక కోసం తోట వైపు వెళ్లేవారు. నేను కూడా చాలాసార్లు వెంట వెళ్లేదాన్ని. ఒకసారి ఉదయం పూట హ్రజత్ గారు భోజనం చేస్తుండగా నేను కూడా వచ్చాను. నా చిన్న కుమార్తె ఏడవడం ప్రారంభించింది. హ్రజత్ గారు ఏమంటోంది ఈమె? అని అడిగారు. నేను రొట్టె అడుగుతోందని అన్నాను. ఆయన ఒక రొట్టె ఇచ్చారు, కానీ ఆమె ఊరుకోలేదు. మళ్లీ ఆయన ఇప్పుడు ఏమంటోంది? అని అడిగారు. నేను హుజూర్ తింటున్న రొట్టెనే ఈమె అడుగుతోంది అని మనవి చేశాను. హుజూర్ తాను స్వయంగా తింటున్న రొట్టెను ఆమెకు ఇచ్చేశారు దాంతో ఆమె నిశ్శబ్దంగా తినడం ప్రారంభించింది.

హుజూరె అన్వర్ ఇట్లు ఉపదేశించారు: గత ఖుత్బాలో నేనొక సంఘటనను వివరించాను. లంగర్ (ఉచిత వంటశాల) ఖర్చులు పెరిగినప్పుడు, హ్రజత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం హ్రజత్ అమ్మా జాన్ రజియల్లాహు అన్హా నగలను అమ్మి ఆ ఖర్చును పూర్తి చేశారు. దీనిపై గత వారం ఒకరు నన్ను ఒక ప్రశ్న అడిగారు. అవసరమైతే భార్య నగలను భర్త తన ఆధీనంలోకి తీసుకుని ఖర్చు చేయవచ్చా? అని. అయితే హ్రజత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అప్పు తీసుకునేవారని, దానిని తిరిగి చెల్లించేవారని స్పష్టం చేయడమైనది. ఈ విషయమై ఒక ఉల్లేఖనం ఉంది. హ్రజత్ మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు అన్హు వివరించారు. హ్రజత్ ఉమ్ముల్ మూమినీన్ నుండి హ్రజత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం డబ్బు అప్పుగా తీసుకున్నారు. గోధుమలు కొనుగోలు చేసి లంగర్ ఖర్చులు, ఇంటి ఖర్చులు పూర్తి చేశారు, ఎందుకంటే చాలా మటుకు భోజనం ఆయన (అ) ఇంటి నుండే వండబడేది. ఆ తర్వాత ఆయన చౌదరి రుస్తుం అలీ గారి నుండి 500 రూపాయలు, కొన్ని నెయ్యి కుండలను తెప్పించి హ్రజత్ అమ్మా జాన్ (రజి) గారి అప్పును తీర్చేశారు.

ఆహారంలో శుభం గురించి మరొక సంఘటన గలదు. హ్రజత్ మియాఁ అబ్దుల్లా సనూరీ (రజి) ఇలా చెప్పారు: ఒకసారి హ్రజత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కొందరు అతిథులకు విందు ఇచ్చారు. భోజన సమయానికి మరికొందరు అతిథులు అదనంగా వచ్చారు. హ్రజత్ అమ్మా జాన్ (రజి) ఎలాగోలా సర్ది, భోజన ఏర్పాట్లు చేయవచ్చు కానీ జర్దా (ఒక రకమైన తియ్యని అన్నం) చాలా తక్కువగా ఉంది, ఇది పంపవద్దు అన్నారు. దానికి హ్రజత్ అలైహిస్సలాం లేదు! ఇది సరైనది కాదు. నువ్వు ఆ జర్దా పాత్ర ను నా ముందుకు తీసుకురా అని అన్నారు. మీరు ఆ పాత్రపై ఒక దస్తీ వేసి, ఆ దస్తీ కింద నుండి తన చేతిని పోనిచ్చి, తన వేళ్లను జర్దాలో పెట్టారు. ఆపై అందరికీ భోజనం వడ్డించండని చెప్పారు. ఆ భోజనం వడ్డించినప్పుడు అందరూ తృప్తిగా తిన్నారు, ఇంకా కొంత జర్దా మిగిలిపోయింది కూడా.

ఇవి ఆయన అలైహిస్సలాం ఔదార్యం మరియు దాతృత్వానికి సంబంధించిన కొన్ని సంఘటనలు. వీటిలో ఆయన తన యజమాని, గురువు (మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అనుసరిస్తూ ఎంతటి మహోన్నతమైన ఆదర్శాన్ని చూపారంటే, తనవారే కాక ఇతరులు, చివరికి శత్రువులు సైతం ఆయన నుండి నిరంతరం ప్రయోజనం పొందుతూనే ఉన్నారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ۔